# బదిరుల భాషలో జాతీయ గీతాలాపన



**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

## కరీంనగర్ కలెక్టర్ ప్రత్యేక చొరవ
## జిల్లా పాలనాధికారి పమేలా సత్పతిపై ప్రశంసల వెల్లువ

దూరదర్శన్ వంటి కొన్ని ఛానెల్స్ మాత్రమే వారి కోసం ప్రత్యేక వార్తా ప్రసారాలు చేస్తుంటాయి. బదిరుల వార్తలు ప్రసారం అయ్యేప్పుడు ఆ చేతి సైగలు అర్థం కాక వ్యాఖ్యానం చేసే యాంకర్ మాటలు వినేందుకు సాధారణ శ్రోతలు చెవులు రిక్కించి మరీ వినేవారు. కొంతమంది అయితే బదిరుల వార్తలు మనకెందుకులే అని టీవీని ఆఫ్ చేసేవారు. కానీ వారి సైగలకు ఓ అర్థం ఉంటుంది.. వారిలోనూ ఓ ఆవేదన ఉంటుంది. వాటిని పరిపూర్ణంగా అవగాహన చేసుకోవల్సిన అవసరం ఉంది అన్న విషయాన్ని గమనించిన ఆ కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రభు త్వ కార్యాలయాలకు వీరొస్తే ఎలా..? వారి సమస్యను పరిష్కారించేందుకు అధికార యంత్రాంగం చొరవ తీసుకునే పరిస్థితి ఉంటుందా..? మూగ మనషులు చేస్తున్న సైగలు అర్థం కాక వారి అవసరాలను తీర్చే పరిస్థితి ఉండదు కదా.. వారి భావాలను అర్థం చేసుకునేందుకు ప్రభుత్వ యంత్రాం గమే సైన్ లాంగ్వేజ్ నేర్చుకుంటే బావుం టుంది కదా అన్న ఆ ఆలోచన మదిలో మె దలడంతో ఇందుకు అవసరమైన కార్యచర ణ రూపొందించి కార్యరంగంలోకి దిగారు ఆ కలెక్టర్.

**తన నుండే..**

ఆచరణలో పెట్టాలని ఆదేశించడం సాధారణం కానీ... ఆచరించాలని తపన పడే వారు మాత్రం కొందరే ఉంటారు. సరిగ్గా ఇదే కోవలోకి వస్తారు కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి. జిల్లా యంత్రాంగానికి సైన్ లాంగ్వేజ్ నేర్పించాలని భావించి ప్రత్యేకంగా బోధకులను నియమించారు. తొలి విడుత ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పని చేస్తున్న వారికి అవగాహన కల్పించారు. అయితే బదిరుల భాషపై పట్టు సాధించేందుకు కేవలం యంత్రాంగాన్ని పురమాయించడమే కాకుండా... జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కూడా ముందుకు రావడం విశేషం. సైన్ లాంగ్వేజ్ నేర్చుకునేందుకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేశారు పమేలా సత్పతి. ఈ లాంగ్వేజ్ నేర్చుకుని బదిరుల మనసుల్లోని భావాలను అర్థం చేసుకున్నట్టయితే వారి అవసరాలు తీర్చడం సులువు అవుతుందని ఈ నిర్ణయం తీసుకున్నారు కరీంనగర్ కలెక్టర్.

**తొలిసారిగా..**

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మునిసిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో పాటు ఇతర జిల్లా అధికారులు బదిరులతో కలిసి జాతీయ గీతాలాపన సైన్ లాంగ్వేజ్ లో చేశారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో తొలిసారిగా చేపట్టిన ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచింది. సాధారణంగా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని బదిరులు జాతీయ గీతాలాపన చేస్తుంటారు. కానీ కరీంనగర్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా సైన్ లాంగ్వేజ్ లో జాతీయ గీతాన్ని ఆలపించడం హైలెట్ గా నిలిచింది. పరేడ్ గ్రౌండ్ లో స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ జెండాను ఎగురవేసేందుకు ముఖ్య అతిథిలుగా వచ్చే మంత్రి సమక్షంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా కళారూపాల ప్రదర్శన, స్టాల్స్ సందర్శన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆయా జిల్లాల్లో ప్రత్యేకతను ప్రదర్శించేందుకు ప్రాధాన్యత ఇస్తుంటారు... కానీ కరీంనగర్ పరేడ్ గ్రౌండ్ మాత్రం అంత్యంత అరుదైన ఘట్టానికి వేదికగా నిలిచింది. అప్పటి వరకూ మంత్రి శ్రీధర్ బాబుతో పాటు వేదికపై ఉన్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఇతర అధికారులు బదిరులతో కలిసి ప్రదర్శన ఇచ్చేందుకు పరేడ్ గ్రౌండ్ లోకి చేరుకోవడం విశేషం. ఉన్నతాధికారులే సైన్ లాంగ్వేజ్ ద్వారా నేషనల్ అంథెమ్ ఆలపించేందుకు కరీంనగర్ పరేడ్ గ్రౌండ్ వేదికగా నిలవడం సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టినట్టయింది. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి తీసుకున్న ఈ చొరవ దేశ వ్యాప్తంగా ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. దేశంలోనే ఏ ఐఏఎస్ అధికారి కూడా బధిరుల భాషలో జాతీయ గీతాన్ని ఆలపించిన సందర్భాలు లేకపోవచ్చు. ఇందుకు కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి శ్రీకారం చుట్టి ఉంటారని తెలుస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరైన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బదిరుల భాషమై మక్కువ పెంచుకుని, పరిపూర్ణమైన అవగాహన పెంచుకున్నతీరు చూసి అబ్బురపడిపోయారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఇతర అధికారుల చొరవను ప్రత్యేకంగా అభినందించారు.



# నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

**శెనార్తి మీడియా,ఆదిలాబాద్:**



ఆదిలాబాద్ పట్టణంలోని రణదివేనగర్ కాలనీలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ సీనియర్ నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి పతాక వందనం చేసారు.అనంతరం ఇంతియాజ్ ఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాలనీకి చెందిన నిరుపేదలకు నిత్యావసర సరుకులు లోక ప్రవీణ్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డేరా కృష్ణ రెడ్డి,ఇంతియాజ్ ఖాన్, యశ్వంత్ నిరాడే, శ్యామ్ రావు కామ్డె షేక్ వాజీద్,దేవానంద్, వాగ్మారే చందు,వినోద్ గైక్వాడ్, రాజ శేఖర్,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



# అమరుల త్యాగాన్ని స్మరించుకోవాలి

**■ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బావునే నగేష్**

**శెనార్తి మీడియా,ఆదిలాబాద్:** మన దేశానికి స్వాతంత్రం కోసం ఎం తోమంది పోరాటం చేశారని వారి త్యాగా లను ప్రతి ఒక్కరూ స్మరించుకోవా లని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బావునే నగేష్ అన్నారు.ఆదిలాబాద్ పట్టణంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో బావునే నగేష్ జాతీయ జెండా ఎగురవేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయులను స్మరించుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఉగ్గే నానయ్య, అఫ్సర్, బావునే వినోద్, సంతోష్, రమేష్, హనుమంతు,చంద్రకాంత్,వినాయక్,దిలీప్,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

**శెనార్తి మీడియా, జగిత్యాల:**

శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భక్త జన సందడి నెలకొంది. అనేక మంది భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. తమ కుటుంబ సౌభాగ్యం కోసం మహిళలు నదీ తీరాన గల సంతోషీమాత, మహాలక్ష్మి, వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయాల్లో ఉద్యాపన పూజలు, కుంకుమ పూజలు జరిపారు. మహాలక్ష్మి ఆలయంలో అష్టోత్తరం, పంచామృతాభిషేకం, హారతి పూజలు చేసి నివేదన సమర్పించారు. ఆలయ అర్చకులు కొరిడె బాలక్రిష్ణ, మధ్వాచారి రాధికాపవన్‌కుమార్ అందంగా అలంకరణ చేసిన అమ్మవారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల యాగశాల వద్ద ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మోహనాచార్యా, విజయ్ లక్ష్మీ హవనం నిర్వహించారు. అనేక మంది భక్తులు లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. రాత్రి వరకు భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

**మహిళ సామూహిక కుంకుమార్చన**

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మినరసింహస్వామి అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మహిళలు సామూహిక కుంకుమార్చన శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు లక్ష్మి అష్టోత్తరం, దుర్గా అష్టోత్తరంతో కుంకుమ పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి హారతి, మంత్రపుష్పం కార్యక్రమాల అనంతరం తీర్థ, ప్రసాద వితరణ చేశారు.

**యమధర్మరాజు ఆలయంలో అభిషేకం**

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి అనుబంధ యమ ధర్మరాజు ఆలయంలో శుక్రవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ, ఒద్దిపర్తి కళ్యాణ్‌కుమార్ స్వామి వారికి రుద్రాభిషేకం, పురుషసూక్తం, లక్ష్మీసూక్తం, మన్యసూక్తంతో అభిషేకం, ఆయుష్య హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వరకు భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్త రాపర్తి సాయికిరణ్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.





# పీఆర్టీయూ తెలంగాణ జిల్లా సమావేశం

**శెనార్తి మీడియా,ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో శుక్రవారం జిల్లా కార్యనిర్వాక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశాన్ని ఆడే నూర్ సింగ్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ర నవీన్ యాదవ్ వార్షిక నివేదికను చదివి వివరించగా.. సంఘం సభ్యులు తమ అభిప్రాయాలను తెలియజేసి తీర్మానం చేశారు.ఇందులో భాగంగానే సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలి,బీఎడ్ తో ఉద్యోగం పొందిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలని,ప్రతి జిల్లాకు రెగ్యులర్ జిల్లా విద్యాశాఖ అధికారులు నియమించాలని వారు కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు విట్టల్ గౌడ్,కనక అభిమాన్,జిల్లా గౌరవ అధ్యక్షుడు దాసరి బాబన్న,జిల్లా కోశాధికారి ముజీబ్,జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్,జిల్లా మీడియా కోఆర్డినేటర్ సంతోష్ కుమార్,తాంసి మండలం అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈసీని మేనేజ్ చేసే..
# అన్ని సీట్లే ఎందుకు వస్తాయి

**శెనార్తి మీడియా,, హైదరాబాద్ :**

తెలంగాణలో తిరంగా ర్యాలీలు ఘనంగా నిర్వహించారని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారని చెప్పారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మూర్ఖత్వంతో జెండాలు ఎగురవేయనీయ లేదని ఆయన మండి పడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ వచ్చిన తరువాత ప్రతి ఒక్కరూ జెండా ఎగురవేసే కార్యక్రమాన్ని చేపట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం ప్రధాని మోదీ ఆలోచన అని పేర్కొన్నారు. మోదీ పాలనకు ముందు పరిస్థితి.. ఆ తర్వాత ఏమిటనేది ప్రజలు చూస్తున్నారని చెప్పారు. అవినీతి రహిత పాలన అందిస్తున్నారంటూ ప్రధాని మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. రెండు రాజ్యాంగాలు అవసరం లేదంటూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోరాటం చేశారని వివరించారు. ఓట్లు గల్లంతు విషయంలో ఎన్నికల సంఘానికి, బీజేపీకి, ప్రధాని మోదీకి ఏం సంబంధమంటూ ఆయన ప్రశ్నించారు దీనిపై ఫిర్యాదు చేస్తే.. ఈసీ చర్యలు తీసుకుంటుందన్నారు. ఎన్నికల సంఘాన్ని తాము మేనేజ్ చేసేలా ఉంటే 240 ఎంపీ సీట్లకు ఎందుకు పరిమితమవుతామంటూ ప్రతిపక్షాలను బండి సంజయ్ సూటిగా ప్రశ్నించారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో ఒక్క ఇంట్లోనే 300 ఓట్లు ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ వాళ్లు 60 ఏళ్ళు దేశాన్ని దోచుకున్నారని.. దీనిపై తాము మీరు రిగ్గింగ్ చేశారని ఎప్పుడైనా అన్నామా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ వ్యవహారంతో కాంగ్రెస్ పార్టీ కుక్కలు చింపిన విస్తరి అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్‌లో మీ పార్టీని నమ్మరని.. అక్కడ గెలిచేది బీజేపీనే అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వానికి ఈ సందర్భంగా స్పష్టం చేశారు